క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

ఇబ్రహీంపట్నం రూరల్: నేడు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. డిపో పరిధిలోని ప్రయాణీకులు నేరుగా తమ సమస్యలను తెలుపవచ్చని, సలహాలు, సూచనలు కూడా ఇవ్వొచ్చని కోరారు. 9959226141 ఫోన్ ద్వారా ప్రజలు మాట్లాడవచ్చని తెలిపారు.

మల్‌రెడ్డికి వినతి



రంగారెడ్డిని కలిసిన శ్రీనివాస్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని రాందాస్‌పల్లి మాజీ సర్పంచ్ ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మార్యదపూర్వకంగా కలిశారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని రాందాస్‌పల్లి, చింతపల్లిగూడకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. భారీ మోజార్టీతో గెలిపించినందుకు శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం పని చేసే వారికి న్యాయం చేస్తామని మల్‌రెడ్డి హామీ ఇచ్చారు.

రంగారెడ్డికి శుభాకాంక్షలు

యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి బుధవారం యాచారం గ్రామానికి చెందిన ముస్లింలు శుభాకాంక్షలు తెలిపారు. అజ్మీర్ దర్గాను దర్శించుకొని వచ్చిన ముస్లింలు ఎమ్మెల్యేను కలిసి ప్రసాదాన్ని అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ గౌస్ ఆధ్వర్యంలో రంగారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ సాజిద్, ఎండీ వలీ, ఎండీ సయ్యద్, సాలార్, అరుణ్‌ప్రసాద్, నందు, హకీమ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ కోసం పడిగాపులు



హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఎదుట క్యూ కట్టిన మహిళలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీ ఎదుట బుధవారం మహిళలు ఈకేవైసీ నమోదు కోసం బారులు తీరారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్న నేపథ్యంలో గ్యాస్ కనెక్షన్‌కు ఈకెవైసీ ఉంటేనే సబ్సిడీ వస్తుందని వదంతులు రావడంతో గ్యాస్ ఏజెన్సీ ఎదుట వినియోగదారులు పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు మాత్రం తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని ఈకేవైసీ నిరంతర ప్రక్రియ అని చెబుతున్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



పడి వెలిగిస్తున్న మురళీధర్‌స్వామి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో బుధవారం పట్టణానికి చెందిన మసున మురళీధర్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి నాగభూషణం నేతృత్వంలో మురళీధర్ ఆధ్వర్యంలో గణపతిపూజ, అయ్యప్ప మహాపడిపూజను నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ, మాజీ వార్డు సభ్యురాలు పెంటమ్మ, స్థానిక నాయకులు గిరి, రవి, వివేక్, బాలకృష్ణ, మల్లేశ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు విజయోత్సవ ర్యాలీ, సభ

కందుకూరు: మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేగా సబితారెడ్డి గెలుపొందిన సందర్భంగా ఆమెతో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కొత్తూర్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సబితారెడ్డి పారంభిస్తారని పేర్కొన్నారు. అక్కడి నుంచి కందుకూరు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించనున్నారని తెలిపారు. అనంతరం సామ నర్సింహారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో విజయోత్సవ సభ కొనసాగనుందని పేర్కొన్నారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సభలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

పేదల కోసమే 'ప్రజాపాలన'

- నేటి నుంచి జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- విజయవంతం చేసేందుకు అధికారయంత్రాంగం ఏర్పాట్లు
- ప్రతి గ్రామం, వార్డుల్లో సభలు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవడానికి 5 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు లక్ష్మణ్, కృష్ణ, చెన్నకేశవులు, శ్రీకాంత్ సింగ్, రాములు, విద్యుత్ ఏఈ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు మండలంలో..

ఆమనగల్లు మండలంలో ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫారూక్ హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న శంకరకొండతండా, మేడిగడ్డ, 29న చింతలపల్లి, మంగళపల్లి, 30న ఆకుతోటపల్లి, సీతారాంనగర్‌తండా, జనవరి 2న శెట్టిపల్లి, సింగంపల్లి, 3న రాంనుంతల, కోనాపూర్, 4న పోలెపల్లి, కొత్తకుంటతాండా, చెన్నంపల్లి గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోండి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య కోరారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వారు ప్రకటించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణనాయక్, అబ్దుల్ ఖాదర్, వస్పుల శ్రీశైలం, అలీం, రహీం, కరీం, శ్రీకాంత్, నాసర్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్ర సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పాలకవర్గసభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ రవీందర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణ కోరారు. ప్రజాపాలన ఏర్పాట్లపై బుధవారం తట్టిఅన్నారం వార్డు కార్యాలయంలో కౌన్సిలర్లు, అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును స్వీకరించి తప్పని సరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరించాలి

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించి అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్లీమోత్యానాయక్ మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ఉదయం 8 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఐదు పథకాలతో పాటు రేషన్‌కార్డులు, ఇతర పథకాల దరఖాస్తులను కూడా స్వీకరించాలని సూచించారు. ఇప్పటికే పెన్షన్లు వస్తున్న వారు కొత్తగా దరఖాస్తులు చేసుకోనవసరం లేదన్నారు. ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువుగా పాలన అందించడంతో పాటు ఆరు గ్యారంటీలను అమలు చేసే దిశగా కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీఓ మధుసూధనాచారి, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచే ప్రజాపాలన

మంచాల: ఈ నెల 28 నుంచి గ్రామాల్లో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీపీ నర్మద, ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మంచాల మండల కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. ప్రధానంగా మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల పథకం, చేయూత పథకాల అమలుకు గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కాంగ్రెస్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. బుధవారం మంచాల మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గడపగడపకూ వెళ్లి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కృపేష్

మాడ్గుల మండలంలో..

మాడ్గుల: ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు నిర్వహించే ప్రజా పాలనను విజయవంతం చేయాలని ఎంపీడీఓ రాఘువులు కోరారు. మాడ్గుల ఎంపీపీ కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ సభల్లో పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిరంజన్‌రావు అధికారులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి
ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్ పేర్కొన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయంలో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృపేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అన్వర్, ఎంపీడీఓ వెంకటమ్మ, ఎంపీఓ లక్పతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

తలకొండపల్లి: ప్రజాపాలనను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీకాంత్ మండలాధికారులకు సూచించారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల మండలాధికారులతో ఎంపీడీఓ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులు నుంచి ఆరు గ్యారంటీలపై గ్రామసభల్లో దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు.

జనవరి 6 వరకు గ్రామసభలు

ధారూరు: నేటి నుంచి (గురువారం)నుంచి జనవరి 6వ తేదీ వరకు ధారూరు మండలంలో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామసభలు నిర్వహించి ప్రజాపాలన దరఖాస్తులను ప్రజానీకం నుంచి స్వీకరించనున్నారు. 28 నుంచి రాజాపూర్, మోమిన్ ఖుర్దు, నర్సాపూర్, గడ్డమీది గంగారం జీపీల్లో 29న గురుదోట్ల, అంపల్లి, రాంపూర్‌తండా, గట్టెపల్లి జీపీల్లో, 30న అల్లాపూర్, నాగసమందర్, అవుసుపల్లి, ధారూరు జీపీల్లో, జనవరి 2వ తేదీన పీసీఎం తండా, నాగారం, అల్లిపూర్, కేరెళ్లి జీపీల్లో, 3న స్టేషన్‌ధారూరు, దోర్నాల్, అంతారం, మోమిన్ కలాన్, 4న తరిగోపుల, నాగ్‌సాన్‌పల్లి, ఎబ్బనూర్, మున్నూరుసోమారం, 5న మైలారం, కుమ్మర్‌పల్లి, చింతకుంట, హరిదాస్‌పల్లి, 6న కొండాపూర్‌కలాన్, ధర్మాపూర్, కుక్కింద, రుద్రారం గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనున్నారు.

సద్వినియోగం చేసుకోండి

కడ్తాల్: ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని అర్హులైన లబ్ధిదారులకు దశల వారిగా సంక్షేమ పథకాలు అందిస్తామని ప్రకటించారు.

అర్హులకు అందేలా కృషి చేయండి

యాచారం: ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజాపాలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాలకు అర్హులకు అందేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీనువాస్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి ఉమారాణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మహాలక్ష్మి'పై వినతి

మంచాల: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నిర్ణయాన్ని సవరించాలని ధర్మ సమాజ్ పార్టీ మంచాల తహసీల్దార్ వెంకట్ ప్రసాద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ కేవలం తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి మాత్రమే ఉచిత ప్రయాణం అనుమతించాలన్నారు. ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు ప్రదీప్‌కుమార్, ప్రవీణ్, రంజిత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



పరమేశ్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

మంచాల: స్నేహితుడు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో అతడి కుటుంబానికి తోటి మిత్రులు అండగా నిలిచారు. మంచాల మండలంలోని జాపాల గ్రామానికి చెందిన నోముల పరమేశ్ (25) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం పరమేష్ కుటుంబ సభ్యులను 2006–07 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు పరామర్శించి రూ.42వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

కనుల పండువగా రథోత్సవం

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్ వేంటేశ్వరస్వామి ఆలయ బ్రహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారు జామున రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొని రథాన్ని లాగారు.

నూతన ఆలోచనలతో ముందడుగు

శంకర్‌పల్లి: విద్యార్థులు తమ భవిష్యత్‌కు సంబంధించి నూతన ఆలోచనలతో ముందడుగు వేయాలని టెక్ మహేంద్ర వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ స్వామినాథన్ మణి అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని దొంతాన్‌పల్లి గ్రామ శివారుల్లోని ఇక్ఫాయి పౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం అమృత్ కాల్ విమర్శ్ వికసిత్ భారత్ 2047 పేరిట సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు తమ ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం ఎంతో ముఖ్యం అన్నారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకొనేందుకు ఉత్సాహం చూపాలన్నారు.

ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడ్గుల: ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ నెల 28 నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాడ్గుల మండలం బ్రహ్మణపల్లి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నారాయణరెడ్డిని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు గ్రామ సభలను వినియోగించుకోవాలని సూచించారు. అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, పార్టీలకు అతీతంగా అందరిని కలుపుకొని పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాంరెడ్డి, పీసీసీ రాష్ట్ర నాయకుడు బాలాజీసింగ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, ఎంపీటీసీ పాండుగౌడ్, సర్పంచ్‌లు లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా 'తహసీల్' భవన నిర్మాణం

- పూర్తి కావస్తున్న నిర్మాణ పనులు
- రెండేళ్లుగా పాల కేంద్రంలో సేవలు
- త్వరగా అందుబాటులోకి తేవాలంటున్న ప్రజలు
- జనవరిలో ప్రారంభించే అవకాశం



నిర్మాణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం

కడ్తాల్: రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. 2016 అక్టోబర్‌లో కడ్తాల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి తహసీల్దార్ కార్యాలయాన్ని స్థానిక పాలశీతలీకరణ కేంద్రంలోని రైతు సమావేశ భవనంలో నిర్వహిస్తూ వస్తున్నారు. భవనం ఇరుకుగా ఉండటంతో సిబ్బందితో పాటు సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో నూతన భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

కొనసాగుతున్న పనులు

2021లో అప్పటి ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి రూ.68 లక్షలు డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేసింది. అదే ఏడాది డిసెంబర్ 14న ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే నిధుల కొరతతో పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశాడు. దీంతో నిధులు కేటాయించి తహసీల్దార్ కార్యాలయాన్ని అందుబాటులోకి తేవాలని కాంగ్రెస్ నాయకులు పట్టుబట్టారు. ఈ నేపథ్యంలోనే రూ.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. నిధులు విడుదల కావడంతో నిర్మాణ పనులను పునఃప్రారంభించారు. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. జనవరి చివరి వారంలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

తీరనున్న సమస్య

ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో ఎలాంటి సౌకర్యాలు లేవని, నూతన భవనాన్ని త్వరగా ప్రారంభిస్తే, సిబ్బందితో పాటు ప్రజలు, రైతులకు సౌకర్యవంతంగా ఉంటుంది. త్వరగా పనులు పూర్తి చేసి, భవనాన్ని త్వరలోనే అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

గోడను తొలగించాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న మాజీ శోభనాద్రీశ్వరరావు, తదితరులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని శ్రీరంగాపురం, సాయినాథ్‌కాలనీతో పాటు కమ్మగూడలోని లక్ష్మీనగర్, సుందరయ్య, ఇందిరమ్మ, శ్రీనివాస్ కాలనీలకు వెళ్లే రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడను వెంటనే తొలగించాలని పలు కాలనీల ప్రజలు బుధవారం రాగన్నగూడలోని వార్డు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ 7 కాలనీలకు వెళ్లే రోడ్డుకు అడ్డంగా గోడను నిర్మించిన అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అడ్డంగా ఏర్పాటు చేసిన గోడను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌ను కోరారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే సదరు భూమి యజమానులకు నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కల్యాణ్ నాయక్, సీపీఎం పార్టీ నాయకులు కిషన్, భాస్కర్‌రెడ్డి, కాలనీ వాసులు మునగపాటి పరమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బస్సుల రద్దీతో ప్రయాణికుల తిప్పలు

కడ్తాల్: మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహాపిరమిడ్ కేంద్రంలో వారం రోజులుగా ధ్యాన మహాయాగాలు జరుగుతున్నాయి. ధ్యాన వేడుకలను తిలకించేందుకు వస్తున్న ప్రయాణికులతో కడ్తాల్ సందడిగా మారుతుంది. ధ్యాన కేంద్రం సందర్శన అనంతరం తిరుగు ప్రయాణంలో బస్సులు రద్దీగా వస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో బస్సుల్లో స్థలం లేక, స్వస్థలాలకు వెళ్లేందుకు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు పిరమిడ్‌కు వచ్చే ధ్యానులను దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులు నడపాలని కోరుతున్నారు.



బస్సు ఎక్కేందుకు తోసుకుంటున్న ప్రయాణికులు

రోడ్ల విస్తరణకు కృషి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సబితారెడ్డి

మహేశ్వరం: గ్రామీణా ప్రాంతాల్లో రోడ్లను విస్తరించి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి–కోళ్లపడకల్ వయా ఘట్టుపల్లి బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మన్సాన్‌పల్లి– కోళ్లపడకల్ వయా ఘట్టుపల్లి డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.15.20 కోట్ల నిధులను తను మంజూరు చేయించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించానని గుర్తు చేశారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయన్నారు. అసంపూర్తి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఘట్టుపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆమె సందర్శించి విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. మన ఊరి–మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేశానన్నారు. విద్యార్థులు ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్, ఘట్టుపల్లి సర్పంచ్ కోరుపోలు అనితారెడ్డి, ఉప సర్పంచ్ మేకల శ్రీనివాస్ యాదవ్, వార్డు సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి శంకరయ్య పాల్గొన్నారు.